

వరంగల్ నగర శివారులోని దేశాయిపేట వద్ద నిర్మించిన డబుల్ ఇళ్ల పైపుల దుస్థితి



వరంగల్ నగర శివారులోని దేశాయిపేట వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు



'కల'గానే సొంతిళ్లు!

పంపిణీకి నోచుకోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

- ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న లబ్ధిదారులు
- ఉమ్మడి జిల్లాకు 25,994 ఇళ్లు మంజూరు
- నిర్మాణం పూర్తైనవి 11,049 మాత్రమే
- 5,728 ఇళ్లను పంపిణీ చేయకుండా తాత్సారం
- శిథిలమవుతున్న గోడలు, తలుపులు, కిటికీలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా గృహాలు
- వెంటనే పంపిణీ చేయాలని లబ్ధిదారుల ఆందోళనలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఆశలు గల్లంతయ్యాయి. కూడు లేకున్నా.. గూడు ఉంటే చాలని ఆశపడిన నిరుపేదలకు నిరాశే మిగులుతోంది. నిర్మాణం పూర్తై ఏళ్ల గడుస్తున్నా అయినా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీకి నోచుకోవటం లేదు. దీంతో సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదలకు నిరీక్షణ తప్పటం లేదు. డబుల్ ఇళ్లు ఇస్తామని మధ్య దళారులు పేదల నుంచి అందినంతా దండుకున్నారు. అయినా ఇళ్లు రాక.. ఇంటి కోసం ఇచ్చిన డబ్బులు తిరిగి రాక.. పేదల అరిగోస పడుతున్నారు. తమకు డబుల్ ఇళ్లు కేటాయించాలని ఆందోళనకు దిగుతున్నారు.

సొంతింటి కల

పేద ప్రజలకు సొంతింటి కలను నిజం చేసేందుకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి ఇస్తామని బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన అధికారంలోకి వచ్చిన తర్వాత డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2014 నుంచి 2023 వరకు రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు 25,994 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేసింది. వీటిలో కేవలం 11,049 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పూర్తి చేశారు. సుమారు ఏడు వేలకు పైగా ఇళ్లు పునాదులు, పిల్లర్లు, రూఫ్ లెవల్ స్థాయిలోనే నిలిచిపోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవటంతో కాంట్రాక్టర్లు మధ్యలోనే గృహ నిర్మాణ పనులను నిలిపివేశారు.

దళారుల వసూళ్లు

డబుల్ ఇళ్ల పేరుతో కొన్నిచోట్ల మధ్య దళారులు భారీగా వసూళ్లు చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పిస్తానని చెప్పి కొందరు గులాబీ నేతలు, దళారులు పేదల నుంచి ఇంటికి రూ.50వేల నుంచి రూ.5లక్ష వరకు వసూళ్లు చేసినట్లుగా ఆరోపణలున్నాయి. హనుమకొండలోని బాల సముద్రం ప్రాంతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు భారీగా డిమాండ్ ఉంది. నగరం నడిబొడ్డున ఈ ఇళ్లు ఉండటంతో చాలామంది దళారుల వీటిపైనే దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇళ్లు ఇప్పిస్తామని రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు అనర్హుల నుంచి వసూళ్లు చేసినట్లుగా ఆరోపణలున్నాయి. జనగామ, భూపాలపల్లి, వరంగల్, మహబూబాబాద్ జిల్లాలోనూ ఇలాంటి ఆరోపణలే ఉన్నాయి.

శిథిలావస్థలో..

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవటంతో అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వరంగల్ జిల్లా దేశాయిపేటలో నిర్మించిన వాటిలో చాలావరకు ఇంటి తలుపులు, కిటికీలు పగిలిపోయాయి. స్లాబ్‌పై నుంచి సిమెంట్ బిచ్చలు రాలుతున్నాయి. హనుమకొండలోని బాలసముద్రంలోని డబుల్ ఇళ్ల పరిస్థితి కూడా శిథిలమై పనికి రాకుండా తయారవుతున్నాయి. ప్రస్తుతం వాటిని మరమ్మతులు చేయాలంటే ప్రతీ ఇంటికి తక్కువలో తక్కువగా రూ.50వేలకు పైగా ఖర్చు వస్తోందని అంచనా. ఖాళీగా ఉండటంవల్ల మరింత శిథిలావస్థకు చేరుకుంటాయని లబ్ధిదారులు అంటున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వినియోగంలో

మిగతా 6వ పేజీలో..

ఉమ్మడి జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్‌ల పరిస్థితి ఇలా..

జిల్లా	మంజూరైన ఇళ్లు	పూర్తైన ఇళ్లు	పంపిణీ చేసినవి	పంపిణీ చేయనివి
వరంగల్	6,333	2,300	597	1,703
హనుమంకొండ	4,219	2,158	433	1,725
జనగామ	4,393	1,454	670	784
మహ-బాద్	5,567	2,503	1,403	1,100
భూపాలపల్లి	3,882	1,418	1,003	416
ములుగు	1,600	1,215	1,215	00
మొత్తం	25,994	11,049	5,321	5,728



మొక్కలతో నిండిపోయిన అంబేద్కర్ నగర్‌లో నిర్మించిన ఇళ్లు



దాశరథి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కవి, ఎమ్మెల్సీ దేశపతి, ఎమ్మెల్యేలు రాంచంద్రునాయక్, మురళీనాయక్

'నా తెలంగాణ కోటి రతనాల వీణ' చిరస్మరణీయం

- కవి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్
- ఘనంగా దాశరథి శత జయంతి ఉత్సవాలు ప్రారంభం

చిన్నగూడూరు, జూలై 22: 'నా తెలంగాణ.. కోటి రతనాల వీణ' అనే దాశరథి వాక్యం తెలుగు సాహిత్యంలో సజీవంగా, చిరస్మరణీయంగా నిలిచిపోయిందని కవి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ కొనియాడారు. చిన్నగూడూరు మండల కేంద్రంలో సోమవారం దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, కవులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాశరథి ప్రాంగణంలో శత జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రారంభ సభలో ముఖ్య అతిథిగా దేశపతి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. రైతాంగ సాయుధ పోరాటంలో కవిత అగ్నిధారలు కురిపించిన సాహితీ యోధుడని, తర్వాత తరానికి అద్భుతమైన సమాజాన్ని నిర్మించాలని కలలుగన్న మహానుభావుడు దాశరథి అని గుర్తుచేశారు. మండలానికి దాశరథి చిన్నగూడూరుగా పేరు పెట్టాలని, మండలంలో దాశరథి స్మారక మందిరం నిర్మించాలని ఎమ్మెల్యేలకు విన్నవించారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ మాట్లాడుతూ దాశరథి స్ఫూర్తిగా యువత ముందుకెళ్లాలని అన్నారు. అనంతరం కవయిత్రి వెంకటలక్ష్మి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. దాశరథి జయంతి సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దాశరథి మెమెంటో బహూకరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే మురళీనాయక్, నందిని సిధారెడ్డి, దేవిప్రసాద్, విరావత్‌అలీ, మానుకోట మునిసిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కమలాకర్, రాంరెడ్డి, పిల్లి వీరన్న, నర్సయ్య, శంకరయ్య, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, రవీందర్‌రావు

నిజాం నిరంకుశ పాలనను ఎదిరించిన ధీశాలి దాశరథి

తెలంగాణ అంటేనే దాశరథి.. దాశరథి అంటేనే తెలంగాణ

కవిత్వం కోసమే తన జీవితం అంకితం

శత జయంతి సభలో ఎమ్మెల్సీ, కవి దేశపతి శ్రీనివాస్

7

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

తొర్రూరు, జూలై 22: ప్రజావాణిలో ప్రజలు చేసుకున్న దరఖాస్తుల సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. సోమవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆర్డీవో నర్సింహారావుతో కలిసి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన చింతకుంట్ల విజయ తమ సర్వే నంబర్లు తప్పు పడ్డాయని దరఖాస్తు చేశారు. గ్రామానికి చెందిన సర్వి భిక్షపతి తమ భూమి రికార్డుల్లో తక్కువగా నమోదైందని, నర్సింహులపేట మండలం వంతడుపులకు చెందిన రైతు వెంకటనర్సు ఎస్సారెస్పీ కాలువలో భూమి పోయిందని నష్టపరిహారం చెల్లించాలని కోరారు. జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ మండల పరిధిలో నిర్మాణం పూర్తైన రెండు పడక గదుల ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని కోరారు. మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య మునిసిపాలిటీ డంపింగ్ యార్డు కోసం పదెకరాల స్థలం ఉందని, మరో ఐదెకరాల స్థలం కేటాయించాలని కోరారు. మొత్తం 50 దరఖాస్తులు రాగా, వాటిలో అత్యధికంగా భూ సమస్యల పరిష్కారానికే వచ్చాయని అధికారులు తెలిపారు. అనంతరం శాఖల వారీగా సమీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. మునిసిపాలిటీలో చేపడుతున్న శానిటేషన్, బిల్డింగ్ పర్మిషన్, పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. వ్యవసాయాధికారులు ఫర్టిలైజర్ షాపులను ప్రతి రోజు తనిఖీ చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ

పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేసి సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు, ఓపీ పేషెంట్లకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, ఫార్మసీలలో రికార్డులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలుంటాయన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రం సందర్శించి లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. డివిజన్ కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో నర్సింహారావు, ఎంపీడీవో సిలార్ సాహెబ్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్

మహబూబాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : గ్రీవెన్స్‌లో స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ అన్నారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 84 దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 55, గిరిజన సంక్షేమ శాఖకు 11, పంచాయతీ శాఖకు 02, ఇతర శాఖలకు మరికొన్నింటితో కలిపి 84 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులపై నిర్లక్ష్యం చేయకుండా ఆయా శాఖల అధికారులు పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో నర్మద, డీపీవో హరిప్రసాద్, సీపీవో సుబ్బారావు, సర్వే ల్యాండ్స్ ఏడీ నర్సింహమూర్తి పాల్గొన్నారు.

ఆశాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ఆశా యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాధవి



మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు

మహబూబాబాద్ టౌన్, జూలై 22 : ఆశా వర్కర్లకు సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆశాలకు ప్రకటించిన అంశాలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు కాసు మాధవి డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్ ఎదుట సోమవారం సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 30వేల మంది 19 సంవత్సరాల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఆశా వర్కర్లుగా పనిచేస్తూ గర్భిణులు, బాలింతలు, పేదలకు ఆరోగ్య భద్రత కల్పిస్తున్నారని గుర్తుచేశారు. కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ మాట్లాడుతూ ఈనెల 24 నుంచి జరిగే బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు సంబంధించిన హామీలపై చర్చించి అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఈనెల 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆకుల రాజు, మల్లయ్య, వీరన్న, రాజ మౌళి, నాగన్న, ఉపేంద్ర, ఆసియా, సుజిత, కాలేశ్వరి, రమణ, ఉమాదేవి, శకుంతల, జయసుధ పాల్గొన్నారు.

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో భట్టు అంజన్నదొరనగర్ కాలనీ, జయశంకర్ కాలనీ, కనకయ్యనగర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయా కాలనీల్లో విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పించి ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్డీ రాష్ట్ర నాయకులు ఆరెల్లి కృష్ణ, జిల్లా నాయకులు మదార్, ఉపేందర్, వెంకన్న, సట్ల యాకయ్య కేశ లింగయ్య శ్రీను, ఐలయ్య, సరిత, మధు, రాము పాల్గొన్నారు.
- ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి ఉపాధ్యాయులను డీఈవో కార్యాలయంలో సిబ్బందిగా ఉపయోగించుకుంటున్న డీఈవో రామారావుపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో గుగులోతు సూర్యప్రకాష్, గంధసిరి జ్యోతిబసు, బానోత్ సింహాద్రి, గుండ్ల రాకేష్, సంజయ్ పాల్గొన్నారు.

గెరువిచ్చిన వర్షం

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 22 : జిల్లాలో గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షం సోమవారం ఉదయం నుంచి కాస్తంత గెరువిచ్చింది. ఉదయం నుంచి వర్షం పడలేదు. దీంతో రైతులు, ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు మహబూబాబాద్ జిల్లాలో 383.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొత్తగూడలో 34.8, గంగారంలో 34.4, బయ్యారంలో 36.4, గార్లలో 22.4, డోర్నకల్‌లో 21.0, కురవిలో 15.2, మహబూబాబాద్‌లో 22.8, గూడూరులో 34.8, కేసముద్రంలో 17.4, నెల్లికుదురులో 16.2, నర్సింహులపేటలో 21.4, చిన్నగూడూరులో 17.2, మరిపెడలో 46.8, దంతాలపల్లిలో 18.4, తొర్రూరులో 19.3, పెద్దవంగరలో 4.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, వెరసి 383.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సగటున 24.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పంటల నమోదును పూర్తి చేయాలి

- కొత్తగా పట్టా పొందిన రైతులు పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి
- జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు

8



బోడగుట్టతండాలో గుడుంబా స్వాధీనం చేసుకున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ (ఫైల్)

గుడుంబాపై ఉక్కుపాదం

- అరికట్టేందుకు పోలీసు శాఖ పటిష్ట చర్యలు
- ఎస్పీ కేకన్ ప్రత్యేక నిఘా..
- ఎక్సైజ్ శాఖతో కలిసి ముమ్మర దాడులు
- 1,90,167 లీటర్ల మద్యం.. 79,549 కిలోల బెల్లం స్వాధీనం
- 69,499 లీటర్ల పానకం ధ్వంసం
- జిల్లా వ్యాప్తంగా 662 మందిపై కేసులు

మహబూబాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్‌ను గుడుంబా రహిత జిల్లాగా చేసేందుకు ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ గుడుంబా విక్రయదారులు, తయారీదారులకు కేక పుట్టిస్తూ ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలు, పట్టణాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహిస్తూ కాచేవారు, విక్రయిస్తున్న వారి గుండెల్లో దడ పుట్టిస్తున్నారు. గత జూన్ 1 నుంచి ఆగస్టు 31 వరకు దాడులు నిర్వహించేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో ప్రతిరోజు ఎక్కడో ఒకచోట స్థావరాలపై ఇరు శాఖల ఆధ్వర్యంలో దాడులు నిర్వహిస్తూ గుడుంబా తయారీ కోసం ఉపయోగించే బెల్లంపానకాన్ని ధ్వంసం చేయడంతోపాటు నల్లబెల్లం, మద్యం, గుడుంబా, పటికను స్వాధీనం చేసుకుంటూ తయారీదారులు, విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తూ తహసీల్దార్ వద్ద బైండోవర్లు చేస్తున్నారు. జిల్లాలో బెల్లం వ్యాపారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. గుడుంబా వలన జరిగే నష్టాలపై గ్రామాల్లో పోలీసు కళాజాత ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

గుడుంబాపై ఉక్కుపాదం

జిల్లాలోని 18 పోలీస్ స్టేషన్ల పరిధిలో గుడుంబా కాచిన, విక్రయించిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టి తెల్లవారుజాము నుంచి గ్రామాలు, తండాలు, పట్టణ శివారు కాలనీల్లో పోలీసులు దాడులు నిర్వహిస్తున్నారు. ఈ దాడుల్లో బెల్లం, మద్యం, పటిక, గుడుంబాను స్వాధీనం చేసుకుంటున్నారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో సీఐలు, ఎస్సైలు, సిబ్బంది కలిసి వరుస దాడులు చేస్తుండడంతో గుడుంబా విక్రయదారులు, తయారీదారులు వణికిపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి బెల్లం తీసుకువచ్చి విక్రయించే వారిని గుర్తించి పట్టుకుని వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారు.

జిల్లాలో పోలీస్‌స్టేషన్ల వారీగా కేసులు, మద్యం(లీటర్లలో..)

పోలీస్‌స్టేషన్	కేసులు	మద్యం	బెల్లంపానకం
మహ-బాద్ టౌన్	24	561	1550
డోర్నకల్	44	462	1200
మహ-బాద్ (రూ)	42	1272	4260
కేసముద్రం	49	5580	742
కురవి	31	670	1650
గూడూరు	58	12245	3070
కొత్తగూడ	32	82383	1657
గంగారం	37	349	40
బయ్యారం	28	1105	4700
గార్ల	27	3540	1550
తొర్రూరు	42	2419	8400
నెల్లికుదురు	26	925	4100
నర్సింహులపేట	36	13390	4350
దంతాలపల్లి	33	11398	3450
పెద్దవంగర	26	934	3500
మరిపెడ	40	27725	8970
సీరోలు	44	22895	7350
చిన్నగూడూరు	43	2314	8960
మొత్తం	662	1,90,167	69,499

దాడుల్లో ఇలా..


మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా గత 47 రోజులుగా పోలీసులు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 69,499 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసి 79,549కిలోల నల్లబెల్లం, 1,90,167 లీటర్ల మద్యం, 4,626 కిలోల పటిక స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీ, విక్రయించే 662 మందిపై కేసులు నమోదు చేసి ఆయా తహసీల్దార్ల వద్ద బైండోవర్లు చేశారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తూ తిరిగి గుడుంబా కాచే వారికి సైతం భారీగా జరిమానాలు విధిస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. మరోపక్క పోలీసు కళాజాత ఆధ్వర్యంలో ఆయా గ్రామాలు, గూడాల్లో గుడుంబా తాగడం ద్వారా జరిగే అనర్థాలపై పాటలు, నాటకాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.



గుడుంబా రహిత జిల్లా కోసం కృషి : సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్

"మహబూబాబాద్ జిల్లాను గుడుంబా రహితంగా మార్చేందుకు పోలీసు శాఖ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా గ్రామాలు, పట్టణాలు, తండాల్లో గుడుంబా కేంద్రాలపై విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నాం. ఇకపై గుడుంబా కాచిన, విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తాం. గుడుంబా రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలి."













'కల'గానే సొంతిళ్లు!

(5వ పేజీ తరువాయి)

లేకపోవటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. సాయంత్రం వేళల్లో మందు బాబులకు అడ్డాగా మారుతున్నాయి. పంచాయతీలు, సెటిల్‌మెంట్‌లకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లనే వాడుతున్నారు. వరంగల్ నగర శివారులోని దూపకుంట ప్రాంతంలో గంజాయి, డ్రగ్స్‌లాంటి వాటిని తీసుకునేందుకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వినియోగిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. వ్యభిచారాలకు కూడా వాడుకుంటున్నారనే చర్చ ఉంది. ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు రక్షణ లేకపోవటంతో ఇష్టారాజ్యంగా వాటిని వినియోగించుకుంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



హనుమకొండ అంబేద్కర్ నగర్‌లో పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

లబ్ధిదారుల ఆందోళనలు



హనుమకొండ అంబేద్కర్ నగర్‌లో ఆదివారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల తాళాలు పగులగొట్టిన లబ్ధిదారులు

హనుమకొండలోని బాలసముద్రం ఇళ్లను పంపిణీ చేయాలని లబ్ధిదారులు ఆదివారం రాత్రి ఆందోళనకు దిగారు. నిర్మాణం పూర్తైన ఇళ్లలోకి వెళ్లటంతో పోలీసులు జోక్యం చేసుకోవల్సి వచ్చింది. అలాగే భూపాలపల్లి పట్టణంలోని 430 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించాలని గత నెలలో నాలుగు రోజులు ఆందోళనకు దిగారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్‌లో నిర్మించిన 712 ఇళ్లు పేదలకు పంపిణీ చేయాలని కలెక్టర్‌ను కలిసి స్థానికులు విజ్ఞప్తి చేశారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరులో 70 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా, వాటిని పంపిణీ చేయకపోవటంతో 40ఇళ్లలో తలుపులు తీసుకుని స్థానికులు నివాసం ఏర్పాటుకు ప్రయత్నించారు. వారంలో గ్రామసభ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని హామీ ఇచ్చి దాటవేశారు. ఇలా ఉమ్మడి వ్యాప్తంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఖాళీగా ఉండటంతో వాటిని తమకు కేటాయించాలని లబ్ధిదారులు ఆందోళన బాట పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే పంపిణీ చేయాలని లబ్ధిదారులకు డిమాండ్ చేస్తున్నారు.







దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలి

ఐఏఎస్ స్మితా సభర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్



ఇల్లందలో కండ్లకు గంతలు కట్టి నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

వర్ధన్నపేట రూరల్, జూలై 22: రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఇల్లందలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్స్‌లో దివ్యాంగులకు రిజర్వేషన్లు అవసరమా? అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన సీనియర్ ఐఏఎస్ స్మితా సభర్వాల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు ఉన్న హక్కులను, చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకుండా, దివ్యాంగుల సమాజాన్ని అడుగడుగునా విస్మరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో పోటీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే భారత వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం స్మితా సభర్వాల్ వ్యాఖ్యలకు నిరసన కండ్లకు నల్లగంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సింహులు, రాష్ట్ర మహిళా నాయకురాలు గుడపల్లి సుమతి, మండల అధ్యక్షుడు జట్టబోయిన శ్రీనివాస్, రాయపర్తి మండల అధ్యక్షుడు ఇస్లావత్ బాలకృష్ణ, నల్గొండ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక మత్స్యగిరి, నాయకులు షారుణ్, వెంకన్న, ముత్తయ్య, రమేష్, హరీఫ్ పాల్గొన్నారు.

వర్సిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వినతి పత్రాన్ని ఇస్తున్న ఉద్యోగసంఘం నేతలు

కేయూ క్యాంపస్, జూలై 22: వర్సిటీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ పుల్లా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిని కలిసి తమసమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2013లో నియమితులైన బోధనేతర ఉద్యోగులందరికీ పే రివిజన్ జీతాలు ఇవ్వాలని, 2010లో నియమితులైన బోధన ఉద్యోగులను క్రమబద్ధీకరించా లని కోరారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. ఏఆర్, సూపరింటెండెంట్, ల్యాబ్ అసిస్టెంట్, టెక్నీషియన్-2, ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్, రికార్డు అసిస్టెంట్, బుక్ కీపర్ ఉద్యోగాలకు ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. వర్సిటీలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలని అన్నారు. పీహెచ్‌డీ పూర్తిచేసిన ఉద్యోగులకు కోర్సు కోఆర్డినేటర్‌గా ప్రమోట్ చేయాలన్నారు. 2013 టెస్ట్ కోటా మేరకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలివ్వాలని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్డీఎల్ఈసీ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, బొక్క మొగిలి, దామెర ప్రభాకర్, నమిండ్ల కిరణ్‌కుమార్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఇంజనీరింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా మహేందర్

కేయూ క్యాంపస్, జూలై 22: కాకతీయ యూనివర్సిటీ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వేశాల మహేందర్ బాధ్యతలు చేపట్టారు. మహేందర్ ఇప్పటి ప్రిన్సిపాల్‌గా ఉన్న ప్రొఫెసర్ మంచాల సదానందం స్థానంలో విధులు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ నేతాజీ, సూపరింటెండెంట్ బొల్లెపాక ప్రభాకర్ నేతృత్వంలో ప్రిన్సిపాల్ మహేందర్‌కు పుష్పగుచ్ఛం అందచేసి శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.సదాశివుడు, డాక్టర్ సంగాల ఎఫ్రామ్‌రాజ్, ఆనంద్, బి.శోభారాణి, మంద శ్యాం, పున్నం చందర్, పి.గౌతమి తదితరులు పాల్గొన్నారు.



మహేందర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కళాశాల సిబ్బంది

ఆర్టీసీ అధికారులపై సస్పెన్షన్ వేటు

బాలసముద్రం, జూలై 22: వరంగల్ రీజియన్ పరిధిలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అకౌంట్ ఆఫీసర్ లావణ్యను ఆర్టీసీ ఉన్నతాధికారులు సోమవారం సస్పెండ్ చేశారు. వరంగల్‌లో లావణ్య అద్దె బస్ ఓనర్ల నుంచి, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టర్లను వేధించడం, పెన్షనర్ల సెటిల్‌మెంటుకు డబ్బులు డిమాండ్ చేసిన ఆరోపణలపై విజిలెన్స్ డిపార్టుమెంట్ ఎంక్వైరీ చేశారు. ఈ నివేదిక అందుకున్న ఆర్టీసీ ఉన్నతాధికారులు ఏవో లావణ్యను సస్పెండ్‌చేసినట్లు సోమవారం తెలిపారు. ఏవో లావణ్యకు సహకరించాడని అసిస్టెంట్ మేనేజర్‌గా ఫైనాన్స్ ఏవోగా ప్రమోషన్‌పై రంగారెడ్డి జిల్లాకు వెళ్లిన రాంమోహన్‌ను సైతం సస్పెండ్ చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

28 నుంచి కేయూ దూరవిద్య పీజీ కోర్సుల తరగతులు

కేయూ క్యాంపస్, జూలై 22: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం 2023-24 ఏడాది ఎంఏ పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఇంగ్లీష్, ఎంకామ్ కోర్సుల ప్రథమ ఏడాది ప్రథమ సెమిస్టర్, రెండో ఏడాది కాంట్రాక్టు తరగతులు నిర్వహిస్తామని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేయూ దూరవిద్య కేంద్రంలో జరిగే తరగతులను అభ్యర్థులందరూ హాజరు కావాలని కోరారు. మిగతా కోర్సుల కాంట్రాక్టు తరగతులను వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని వెల్లడించారు.

రెడ్‌క్రాస్ కమిటీలో కొత్త వారికి అవకాశం

ఆరేళ్లు దాటితే తప్పుకోవాల్సిందే : గవర్నర్ ఆదేశాలు

వరంగల్ మెడికల్, జూలై 22: రాష్ట్రవ్యాప్తంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీల్లో కొత్తవారికి అవకాశం కల్పించాలని రాష్ట్ర గవర్నర్ ఆదేశించారు. ఈ మేరకు రాజ్‌భవన్ నుంచి తాజాగా లేఖ నెంబర్ 681/టి2/ఎస్/2024 విడుదలైంది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీల్లో కీలక బాధ్యులుగా ఎన్నికై ఆరేళ్లకు పైగా కానీ, రెండు విడతలుగా కానీ కొనసాగుతున్న వారు ఇకపై స్వచ్ఛందంగా తప్పుకోవాల్సిందేనని లేఖలో పేర్కొంది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి రాష్ట్ర స్థాయిలో గవర్నర్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. జిల్లా కమిటీలో 10 నుంచి 15 మంది వరకు సభ్యులుంటారు. ఇందులో కీలక పదవుల్లో ఉన్న రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి ఆరేళ్లు పూర్తి చేసుకున్న, రెండు విడతల పదవీ పూర్తిచేసుకున్న వారు వెంటనే స్వచ్ఛందంగా రాజీమానా చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

రేసులో ముగ్గురు

హనుమకొండ జిల్లా రెడ్‌క్రాస్‌సొసైటీ చైర్మన్‌గా డాక్టర్ విజయచందర్‌రెడ్డి చాలా ఏళ్లుగా పని చేస్తున్నారు. గవర్నర్ లేఖతో ఆయన స్వచ్ఛందంగా తప్పుకుంటే ఈ పదవికోసం ముగ్గురు పోటీ పడుతున్నారు. డాక్టర్ శేషు మాధవ్, డాక్టర్ హరి సంధ్యారాణి, పెద్ది వెంకట నారాయణగౌడ్ పోటీ పడుతున్నారు.

నిజాం నిరంకుశ పాలనను ఎదురించిన ధీశాలి దాశరథి

దాశరథి రచనలు తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి : ఎమ్మెల్సీ, కవి దేశపతి శ్రీనివాస్



మహబూబాబాద్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, కవి దేశపతి శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, జూలై 22: నిజాం నిరంకుశ పాలనను ఎదిరించి పేదల పక్షాన నిలిచి కవిత్వాన్ని రాసిన మహాకవి దాశరథి ఆశయాలను ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం మనందరిపై ఉందని ఎమ్మెల్సీ, కవి దేశపతి శ్రీనివాస్ అన్నారు. దాశరథి జయంతిని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్వీఎం ఫంక్షన్ హాల్‌లో సోమవారం దాశరథి శత జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శత జయంతి సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్యవక్తగా హాజరైన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడారు. దాశరథి తన 20వ ఏటనే పోరాటాల బాట పట్టి నిరంకుశ పాలన సాగిస్తున్న నిజాం నవాబును ఎదిరించారని చెప్పారు. నిజామాబాద్ జైలులో బంధిస్తే అక్కడ బొగ్గు ముక్కతో ఓ నిజాం పిశాచమా అంటూ రాసి ఉద్యమాన్ని రగిల్చిన గొప్ప వ్యక్తి దాశరథి అని కొనియాడారు. జైలులో బంధించినప్పటికి సింహంలా గర్జించారని గుర్తుచేశారు. ఆయన ప్రజల కోసమే కవిత్వం రాసేవారని, తన రచనలు తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచాయని పేర్కొన్నారు. దాశరథి అంటేనే తెలంగాణ... తెలంగాణ అంటేనే దాశరథి అని తెలంగాణ అస్థిత్వాన్ని తన కవిత్వంలో చూపించారని పేర్కొన్నారు. భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడుతూ సమాజంలో దుర్మార్గం, వెట్టిచాకిరి విముక్తి తన కర్తవ్యంగా పనిచేశారని తెలిపారు. ప్రజా కవులు దాశరథి, కాళోజీల జీవిత చరిత్రలు చదివితే తెలంగాణ గుర్చి తెలుస్తుందని, సరళమైన పదాలతో అందరికి అర్థమయ్యే రీతితో దాశరథి కవిత్వం ఉండేదన్నారు. ఆంగ్ల కవి షేక్స్‌పియర్ కంటే గొప్ప కవి దాశరథి అన్నారు.

ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ మాట్లాడుతూ.. ప్రజల కష్టాలు, జీవితాలు ప్రతిబింబాలుగా దాశరథి కవిత్వం ఉండేదని, ఆయన దేశం గర్వించదగ్గ కవి అని కొనియాడారు. ప్రజలను చెడు మార్గంలోకి వెళ్లకుండా సన్మార్గంలో నడిపించేది కవిత్వమని, దాశరథి గొప్ప మేధావి అని, ఆయన పుట్టిన గడ్డలో తాను ఎమ్మెల్యేగా పనిచేయడం అదృష్టమని చెప్పారు. దాశరథి సంపద పుస్తకాలేనని అలాంటి మహనీయుడిని ప్రజల్లోకి తీసుకువెళితే తెలుగును బతికించుకున్న వారమవుతామని తెలిపారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ స్వరాష్ట్ర ఉద్యమానికి ఊతమిచ్చిందని చెప్పారు.

ప్రముఖ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ.. దాశరథి మన మధ్య లేకపోయినా జ్ఞాపకాలు మిగిలే ఉన్నాయని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో దాశరథి శత జయంతి ఉత్సవాలు జరగాలని ఆకాంక్షించారు. జాగీరు దారులకు వ్యతిరేకంగా గర్జిస్తూ ప్రజల కోసం.. పాలకులను ప్రశ్నిస్తూ తన కవితలను రాసిన మహా కవి దాశరథి అని తెలిపారు. టీఎన్జీవోస్ పూర్వ అధ్యక్షుడు దేవీప్రసాద్ మాట్లాడుతూ.. దాశరథి పోరాట వారసత్వాన్ని ఈ సమాజానికి అందించాలన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ మాట్లాడుతూ.. ప్రజల కోసం తన జీవితాన్ని ఫణంగా పెట్టి నిజాం నవాబును ధిక్కరించిన కవి దాశరథి అని చెప్పారు. చిన్నగూడూరుకు దాశరథి మండలంగా పేరు పెట్టాలని కోరారు. ఎమ్మెల్సీ, దాశరథి శత జయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. దాశరథిని స్మరించుకుంటూ ఆయన జీవిత చరిత్రను భావితరాలకు అందిస్తూ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని చెప్పారు. జిల్లాలో సంవత్సర కాలం పాటు దాశరథి జయంతి ఉత్సవాలను జరిపి ముగింపు సభను జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అనంతరం సభకు హాజరైన వక్తలు, అతిథులను శాలువాలతో సత్కరించి మెమొంటోలను అందజేశారు. చివరగా కవి సమ్మేళనాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు అడ్డగోడ రాజేష్, ఉత్సవ కమిటీ చిన్నగూడూరు మండల అధ్యక్షుడు గునిగంటి కమలాకర్, కవి గుర్రపు సత్యనారాయణ, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, బానోత్ రవికుమార్, ఎడ్ల వేణు, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, కన్న, జెరిపోతుల వెంకన్న, కవులు, దాశరథి అభిమానులు పాల్గొన్నారు.

గాయని సనశ్రీకి రికార్డుల పంట



సనశ్రీకి రికార్డుల పత్రాలను అందజేస్తున్న నిర్వాహకులు

హనుమకొండ కల్చరల్, జూలై 22: నగరానికి చెందిన ప్రముఖ గాయని సనశ్రీ తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో ఏకధాటిగా 8 గంటల పాటు 108 పాటలను ఆహుతుల సమక్షంలో ఆలపించి ప్రశంసలు అందుకుంది. అంతేగాక తెలుగు బుక్‌ఆఫ్ రికార్డు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులలో సనశ్రీ పేరును నమోదు చేసుకోవడం విశేషం. ఈ అపూర్వ కార్యక్రమానికి హనుమకొండలోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియం వేదికగా నిలిచింది. ఆదివారం రాత్రి బాగా పొద్దుపోయే వరకు జరిగిన ఈ కార్యక్రమంలో అనేక మంది ప్రముఖులు పాల్గొని సనశ్రీని ప్రశంసలతో ముంచెత్తారు. కాకతీయ మ్యూజికల్ క్లబ్ వ్యవస్థాపకుడు రంగు రఘుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ అపూర్వ వేడుకలను ఉదయం ప్రముఖ సంగీత విద్వాంసుడు ఆచార్య తిరుపతయ్య లాంఛనంగా ప్రారంభించగా నగరానికి చెందిన అనేక మంది ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని తిలకించి గాయని సనశ్రీని అభినందించారు. ఈ అవార్డులను జ్యూరీ మెంబర్ టీవీ అశోక్ కుమార్ హాజరై అందజేశారు.



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీసీ దేవేందర్‌రెడ్డి

ఇద్దరు ఏటీఎం దొంగల అరెస్టు

కార్డులు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం : ఏసీసీ దేవేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూలై 22: ఏటీఎం కేంద్రాల్లో డబ్బులు దొంగలించే ఇద్దరు దొంగలను హనుమకొండ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులకు సంబంధించిన వివరాలను ఏసీపీ దేవేందర్‌రెడ్డి వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫతేపూర్‌కు చెందిన శుభం, ప్రియాంక అనే ప్రేమజంటకు బట్టలషాప్‌లో పనిచేసే శివవీర్ సింగ్, అనిశ్‌సింగ్, సత్యవీర్, ప్రియాంక సింగ్, ఓ మైనర్ పరిచయమయ్యారు. కిందటేడు నుంచి ఆంధ్రప్రదేశ్, నాగపూర్, చంద్రపూర్ తీసుకెళ్లి దొంగతనం ఎలా చేయాలో శుభం, అతడి ప్రియురాలు నేర్పించారు. తర్వాత హనుమకొండ, వరంగల్‌లో కెనరా, ఎస్‌బీఐతో కలిపి 6 ఏటీఎంలలో విడతల వారీగా రూ.25,500 దొంగలించారు. తాజాగా సోమవారం హనుమకొండలోని కెనరా బ్యాంకు ఏటీఎంను ధ్వంసం చేసి డబ్బులు దొంగలించేందుకు ప్రయత్నిస్తుండగా పక్కాసమాచారంతో హనుమకొండ పోలీసులు అక్కడికి వెళ్లి శివవీర్ సింగ్, అనిశ్‌సింగ్‌లతోపాటు ఒక మైనర్‌ను పట్టుకున్నారు. వీరి నుంచి దొంగలించడానికి వినియోగించిన సామగ్రి, రెండు ఏటీఎంలు, 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కాగా ప్రధాన నిందితులు శుభం, అతడి ప్రియురాలు ప్రియాంకతో పాటు సత్యవీర్, ప్రియాంక సింగ్ పరారీలో ఉన్నారన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ సీఐ వై.సతీష్, సీసీఎస్ సీఐ అబ్బయ్య, ఎస్సై సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏనుమాముల మార్కెట్ గ్రేడ్ -2 కార్యదర్శిగా అజిత్‌రావు



అజిత్ రావు

వరంగల్ వ్యవసాయం, జూలై 22: ఏనుమాముల(వరంగల్) వ్యవసాయ మార్కెట్ కమిటీ గ్రేడ్-2 కార్యదర్శిగా దన్నపునేని అజిత్ రావు బదిలీ అయ్యారు. ఇటీవల మార్కెటింగ్ శాఖ అధికారులు నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా భువనగిరి వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా పనిచేస్తున్న అజిత్‌రావును ఏనుమాముల మార్కెట్‌కు బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులు అందగానే బాధ్యతలు చేపడుతానని అజిత్‌రావు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన సూపర్‌వైజర్లు



మార్కెట్ కార్యదర్శి నిర్మలకు సూపర్‌వైజర్ల సత్కారం

మార్కెటింగ్‌శాఖ అధికారులు ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా వర్ధన్నపేట మార్కెట్ నుంచి చక్రబహదూర్ రాయ్, నెక్కొండ మార్కెట్ కమిటీ నుంచి అల్లి జ్యోతిప్రకాష్‌ను, నర్సంపేట మార్కెట్ నుంచి ఎండి.సలీంను అలాగే మేకల రజిత జేఎంఎస్‌ను ఏనుమాముల మార్కెట్‌కు బదిలీ చేశారు. కాగా, సోమవారం బదిలీపై వచ్చిన ముగ్గురు సూపర్‌వైజర్లను, ఒక జేఎంఎస్ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మలను మర్యాదపూర్వకంగా కలిసి బదిలీ ఉత్తర్వులను అందించారు. అనంతరం వారు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి నిర్మలను సత్కరించారు. కార్యక్రమంలో గ్రేడ్ కార్యదర్శి రామోజు రాము, అసిస్టెంట్ సెక్రటరీలు రాజ్‌కుమార్, గందమల్ల రాజేందర్, సూపర్‌వైజర్లు నల్ల నర్సింగరావు, గంగాధర్, భూక్యా వెంకన్న నాయక్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

తెలంగాణ హెర్నియా సొసైటీ ఏర్పాటు

వరంగల్ మెడికల్, జూలై 22: కాకతీయ మెడికల్ కళాశాలలోని ఎన్ఆర్ఐక్యాంప్‌లో హెర్నియా సర్జన్స్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెర్నియా సొసైటీ ఆఫ్ తెలంగాణ ఆవిర్భావం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో హెర్నియా సొసైటీ ఆఫ్ తెలంగాణ ఏర్పాటుకు కమిటీ చైర్మన్‌గా డాక్టర్ కూరపాటి రమేశ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా నామినేట్ చేశారు. అనంతరం డాక్టర్ ఉమాకాంత్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆధునిక లాపరోస్కోపీ సేవలు అందించడానికి డాక్టర్ కూరపాటి రమేశ్, ఇతర సభ్యులు బాధ్యత వహించి సేవలను విస్తత పర్చాలన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేశ్ చంద్రహరి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ కోటపై బహుజన జెండాను ఎగరవేయాలి

బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్

వడ్డెపల్లి, జూలై 22: బీసీలు ఆశించే స్థాయి నుంచి.. శాసించే స్థాయికి ఎదగాలనే సంకల్పంతో దేశమంతా బీసీ ఉద్యమాన్ని విస్తరించి, ఢిల్లీ కోటపై బహుజన జెండాను ఎగరవేసేందుకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో ఉద్యమాలు కొనసాగుతున్నాయని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ జనాభాలో 60శాతంపైగా ఉన్న బీసీలు.. విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో ప్రాతినిధ్యం లేకపోవడంతో అరశాతం ఉన్న అగ్రవర్ణాలు అధికారాన్ని అనుభవిస్తున్నాయన్నారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు ఆగస్టు7న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లోగల ద గోల్డెన్‌జూబ్లీ సెలబ్రేషన్ హాల్‌లో అఖిల భారత జాతీయ ఓబీసీ 9వ మహాసభలను నిర్వహిస్తున్నామని బీసీ సమాజమంతా పాల్గొని విజయవంతం చేయాలని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ కోరారు. మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, రాష్ట్ర, జిల్లా నాయకులు బచ్చు ఆనందం, తాళ్ల సంపత్ కుమార్, కాసగాని అశోక్ గౌడ్, పంజాల మధు, దాడి రమేష్, కురిమిళ్ల శ్రీనివాస్, తాళ్లపెల్లి రమేష్, కడారి అనిల్, పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

న్యాయవాది శంకర్ ప్రసాద్‌రావుకు నివాళి



సంతాప కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు

వరంగల్ లీగల్, జూలై 22: సీనియర్ న్యాయవాది కె.శంకర్‌ప్రసాద్‌రావు మృతికి హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్లు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం వరంగల్ అంబేద్కర్ బార్ అసోసియేషన్ హాల్‌లో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 20న అనారోగ్యంతో మృతిచెందిన శంకర్ ప్రసాద్‌రావు హనుమకొండ పట్టణం అడ్వకేట్స్‌కాలనీకి చెందినవారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 1995 నుంచి వరంగల్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు.

అంతకుముందు హనుమకొండ జిల్లా కోర్టు హాల్‌లో జిల్లా ప్రధానసెషన్స్ జడ్జి సీహెచ్.రమేష్‌బాబు ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ, ఇరు జిల్లాలకు చెందిన అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు, ప్రభుత్వ న్యాయవాది కె.నర్సింహరావు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ అధ్యక్షతన సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శులు లాడే రమేష్, ముదసర్ అహ్మద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు భైరపాక జయాకర్, దుస్స జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా కళ్లల్లోనే ఆ పీడ కల

మోరంచపల్లిని ముంచేసిన వరదకు ఏడాది

- భారీగా వాటిల్లిన ప్రాణ, ఆస్తి, పంట నష్టం
- వరదల్లో ఐదుగురి గల్లంతు.. ముగ్గురి మృతదేహాలు లభ్యం
- ఇప్పటికీ దొరకని మరో ఇద్దరి ఆచూకీ
- ఆ కాళరాత్రినే తలుచుకుంటూ వణికిపోతున్న గ్రామస్థులు



గతేడాది వచ్చిన వరదతో మునిగిపోయిన మోరంచపల్లి గ్రామం (ఫైల్)

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూలై 22: మోరంచపల్లి... భూపాలపల్లి జిల్లా కేంద్రం సమీపంలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉండే ఓ గ్రామం. ఆ ఊరికి వరద ఎలా ఉంటుందో ఎప్పుడు తెలియదు. కానీ, గతేడాది జూలై 27న అకస్మాత్తుగా భారీ వరద ఊరిని ముంచెత్తింది. క్షణాల్లో ప్రళయం అంటే ఎలా ఉంటుందో ఆ ఊరిజనాలకు ప్రత్యక్షంగా కళ్ల చూపింది. నాటి ఈ దుర్ఘటనలో మొత్తం ఐదుగురు గల్లంతవగా వారిలో ముగ్గురు మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో ఇద్దరి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. వందలాది పశువులు, పెంపుడు జంతువులు మృత్యువాత పడ్డాయి. నాటి పీడకలకు ఏడాది పూర్తి కావస్తున్న వేళ మరోసారి వర్షాలు, వరదలు ప్రారంభం కావడంతో ఆ గ్రామస్థులు మళ్లీ ఉలిక్కి పడుతున్నారు.

ఆ రోజు తెల్లవారుజామున..

ఇంకో గంటయితే తెల్లవారుతుందనేలోపే గ్రామాన్ని వరదనీరు చుట్టుముట్టింది. 2023 జూలై 26న మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా గణపసముద్రంలోకి నీరు అధికమై మత్తడి పెరగడంతో మోరంచవాగులోకి వరద పెరిగి ఇళ్లలోకి చేరింది. 27న తెల్లవారుజామున 4గంటల సమయంలో వరద గ్రామానికి తాకింది. అది గ్రహించిన కొంత మంది గ్రామస్థులు.. కుందయ్యపల్లి, కర్కపల్లి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. వరద ముప్పును అంచనా వేయలేకపోయిన వారు ఇళ్లలోనే ఉండిపోవడంతో నీళ్లన్నీ ఇళ్లను ముంచెత్తాయి. ఇళ్ల సజ్జల వరకు నీరు వేగంగా ప్రవహించింది. దీంతో ప్రాణాలు కాపాడుకునేందుకు చాలా మంది ఇళ్ల సజ్జలు, స్లాబులు, చెట్లపైకి ఎక్కారు. ఇదంతా పూర్తిగా తెల్లవారాక సోషల్ మీడియా వేదికగా తమను కాపాడాలని బాధితులు ఫొటోలు, వీడియోలు షేర్ చేయడంతో వారి ఆర్తనాదాలు బహిర్గతమయ్యాయి. అప్పటికప్పుడు అధికార యంత్రాంగం రంగంలోకి దిగి.. సింగరేణి రెస్క్యూ, అగ్నిమాపక రెస్క్యూ సిబ్బంది చేరుకొని వరదల్లో చిక్కుకున్న సుమారు 150 మందిని బోటు సహాయంతో సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ విషయం సంచలనమైంది. అప్పటి ప్రభుత్వం, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవతో రెండు ఆర్మీ హెలికాప్టర్లు గంటల వ్యవధిలో మోరంచపల్లి గ్రామానికి చేరుకున్నాయి. గ్రామం మీదుగా చుట్టూ ముట్టి పైనుంచి సమీక్షించారు. గ్రామానికి అతి దగ్గరగా ఆ ప్రాంతాన్నంతా పరిశీలించారు.

నాలుగు కుటుంబాల్లో విషాదం

భారీగా వచ్చిన వరదలు నాలుగు కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. వరద తాకిడి తట్టుకోలేక ఐదుగురు గల్లంతు అయ్యారు. గ్రామానికి చెందిన గొర్రె ఓదిరెడ్డి, వజ్రమ్మ, గంగడి సరోజన, గడ్డం మహాలక్ష్మితోపాటు గ్రామంలోని శ్మశానవాటికలో తలదాచుకున్న ఓ గుర్తుతెలియని యాచకుడు కొట్టుకపోయారు. వారి కోసం రెస్క్యూ బృందం గాలించినా ఆ రోజు మృతదేహాలు దొరకలేదు. మరుసటి మూడు రోజుల వ్యవధిలో గడ్డం మహాలక్ష్మి, గుర్తుతెలియని యాచకుడు మినహా మిగిలిన ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. అయితే గడ్డం మహాలక్ష్మి.. భర్త శ్రీనివాస్ కళ్లారా చూస్తుండగానే కొట్టుకుపోవడం, ఎంత వెతికినా ఆమె ఆచూకీ దొరక్కపోవడం, కనీసం మృతదేహం కూడా లభ్యం కాకపోవడంతో ఆమె తిరిగొస్తుందన్న ఆశలు వదులుకున్న భర్త తన భార్య ఇక బతికి రావడం కష్టమేనని భావించి నెలవారీ మాశికాలు నిర్వహించడంతో పాటు ఈనెల 15న ఆమె సంవత్సరీకాన్ని కూడా జరిపించారు.

అపారనష్టం..

మోరంచవాగు వరద ఉధృతి గ్రామస్థులను అన్ని రకాల నష్టాలను చవిచూపింది. మూగ జీవాల మృత్యుఘోష వినిపించింది. గ్రామంలో ఉన్న మూగజీవాలు ఊపిరాడక 153 గేదెలు, 753 కోళ్లు, 3 దుక్కిటెద్దులు, 5 బాతులు మృతి చెందాయి. మరో 50 గొర్రెలు వరదలో కొట్టుపోయాయి. ఇక పంటలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లో 25,181 ఎకరాలు నీట మునిగాయి. వీటితో పాటు 1800 ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. వరి 13,290 ఎకరాలు, 11,891 ఎకరాల్లో పత్తి తీవ్రంగా నష్టాన్ని మిగిల్చింది. ఇక ఇళ్లలోని బియ్యం, దుస్తులు, మంచాలతో పాటు కూలర్, ఫ్రిజ్, టీవీ లాంటి ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు ఇళ్లలోని సామగ్రి మొత్తం తడిసిపోయాయి. అలాగే, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు వరదలో కొట్టుకుపోయి గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఆగిపోయి కనిపించాయి.

కొండంత కష్టం.. గోరంత సాయం..

మోరంచపల్లి గ్రామస్థులకు వచ్చిన కష్టానికి సరిపడా సాయం అప్పటి సర్కారు అందించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామం మునక వైరల్ అయింది. కానీ, ఈ విషయంపై అప్పటి సీఎం గ్రామం పేరును కూడా కనీసం ప్రస్తావించలేదన్న విమర్శలు వెల్లువెత్తాయి. ప్రభుత్వం తరుపున కేవలం రూ.10వేలు మాత్రమే అందించారు. అలాగే, సింగరేణి తరుపున కార్మికుల నుంచి కొంత మొత్తాన్ని జమ చేసి కుటుంబానికి రూ.15వేలు అందించారు. అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సొంతంగా రూ.4వేల చొప్పున ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, తాగునీటిని అందించారు. ఇక వివిధ కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి తోచిన సహాయాన్ని చేశారు. అయినా వీరికి జరిగిన లోటును మాత్రం పావలా వంతు కూడా పూడ్చలేకపోయింది.



సాయం కోసం వచ్చిన హెలికాప్టర్

పరామర్శలకే పరిమితం?

వరద ఉధృతి మోరంచపల్లిని ముంచేసిందనే వార్త ఆ సమయంలో సంచలనంగా మారింది. సోషల్ మీడియాతో పాటు టీవీచానళ్లు, దినపత్రికలు బాధితులకు అండగా ఉండి వారి బాధలను బహిర్గతం చేశాయి. దీంతో వివిధ పార్టీల నేతలు మోరంచపల్లి బాట పట్టారు. నాడు రాష్ట్ర మంత్రిగా ఉన్న సత్యవతి రాథోడ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ నేత ఈటల రాజేందర్, బీఎస్పీ నేతగా ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ, డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ ఇల్లిల్లు తిరిగి బాధితులను పరామర్శించారు. కానీ, వారి కష్టాలను గట్టెక్కించేందుకు మేమున్నామనే భరోసానివ్వలేకపోయారన్న విమర్శలు వ్యక్తమయ్యాయి.

గండి పడిన చెరువులకు మరమ్మతులు

గతేడాది వరదలకు ప్రధానంగా వర్షపాతం అధికంగా నమోదు కావడం ఓ కారణమైతే.. ఇదే తరుణంలో గణపురం మండలం ధర్మరావుపేట చెరువు, వెంకటాపూర్ మండలం బూర్గుపేట చెరువులకు గండిపడటంతో ఈ వరద ముంచెత్తింది. మరోవైపు ఇదే సమయంలో గణపసముద్రంలోకి 22 అడుగులకు ఉండాల్సిన నీటి మట్టం ఒక్కసారిగా 33 అడుగులకు పెరిగి ఉప్పొంగడంతో ఈ సమస్య తీవ్రతరమైంది. అయితే, గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యల్లో భాగంగా చెరువుల మరమ్మతు పనులను సైతం చేపట్టింది. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నేతృత్వంలో ధర్మరావుపేట ఊర చెరువుకు రూ.1కోటి 70లక్షలు వెచ్చించి పనులు చేపట్టారు. వెంకటాపురం మండలం బూర్గుపేట చెరువుకు సైతం గండి పడకుండా పకడ్బందీ మరమ్మతులు చేశారు. అయినప్పటికి గ్రామస్థులను మాత్రం ఆ భయం వీడకపోవడం శోచనీయం.



అధిక వరద తాకిడికి తెగిపోయిన జాతీయ రహదారి (ఫైల్)

కంకరబోడు పాఠశాలను సందర్శించిన డీఈవో

మహబూబాబాద్ టౌన్, జూలై 22 : మహబూబాబాద్ పట్టణంలోని కంకరబోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి రామారావు సందర్శించారు. ఉదయం ప్రార్థన సమయానికి కంటే ముందే వెళ్లిన డీఈవో ప్రార్థనలో పాల్గొని మారిన పాఠశాలల వేళల గురించి విద్యార్థులకు వివరించి తగు సూచనలు చేశారు. ఈసందర్భంగా డీఈవో రామారావు మాట్లాడుతూ.. మహాకవి దాశరథి కృష్ణమాచార్యులను స్ఫూర్తిగా తీసుకుని ఎదగాలని సూచించారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి భవిష్యత్‌ను బంగారుమయం చేసుకోవాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. హెచ్ఎం మాలోతు కోట్యా పాల్గొన్నారు.

పత్తిపాక రోడ్డు పనులు పూర్తిచేయాలి : కేవీపీఎస్

మహబూబాబాద్ టౌన్, జూలై 22: మహబూబాబాద్ నెహ్రూసెంటర్ నుంచి పత్తిపాక రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలు, వాహనదారుల కష్టాలను తీర్చాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి డిమాండ్ చేశారు. పత్తిపాక రోడ్డు విస్తరణ పనులపై నిర్లక్ష్యం వహించడం పట్ల రోడ్డుపై కేవీపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాంమూర్తి మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గుంతలు తవ్వి వదిలేయడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మందుల మహేందర్, అల్వాల ఆనంద్, పులిపాక నాగరాజు, పులిబుజ్జ వెంకన్న, లాలయ్య, ఎర్ర శ్రీను, పల్లపు రాము, పరమేష్, వసంత, భువనేశ్వరి, నర్సింహారావు పాల్గొన్నారు.

సమాజంలో ఆడపిల్లలకు రక్షణ కరువు

బయ్యారం, జూలై 22 : విష సంస్కృతి మూలంగా సమాజంలో ఆడపిల్లలకు రక్షణ కరువైందని మహిళా సాధికారిత, జెండర్ స్పెషలిస్ట్ అరుణ అన్నారు. ఈ ఏడాది జూలై నుంచి అమలులోకి వచ్చిన నూతన చట్టాలపై సోమవారం బయ్యారం కస్తూర్బా గాంధీ గిరిజన బాలికల విద్యాలయం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మాయిలను రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అమ్మాయిల పట్ల వివక్ష చూపరాదన్నారు. అమ్మాయిల భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు రూపొందించి అమలు పర్చాలన్నారు. అనంతరం షీటీం సభ్యులు నూతన చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో షీటీం ఏఎస్ఐ ఆనంద్, భరోసా టీం సభ్యురాలు సుప్రజ, మహిళా సాధికారిత సభ్యుడు రాకేష్, కస్తూర్బా విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అంతకుముందు మహిళా సాధికారతకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఏసీడీపీవో

నెల్లికుదురు, జూలై 22 : నెల్లికుదురు మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏసీడీపీవో ఇందిర సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే గుడ్లు, పప్పు, బియ్యం పాల ప్యాకెట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బాలింతలకు, పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందుతుందని అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

గడ్డి నివారణ మందు తాగుతూ యువకుడి సెల్ఫీ వీడియో

▸▸ చికిత్స పొందుతూ మృతి


రామకృష్ణ (ఫైల్)

మహబూబాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఇనుగుర్తి మండలకేంద్రానికి చెందిన సంగెం రామకృష్ణ(21) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసముద్రం ఎస్సై మురళీధర్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం... ఇనుగుర్తికి చెందిన రామకృష్ణ కాజీపేట రైల్వేలో కాంట్రాక్టు పద్ధతిన ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం ఇంటికి వచ్చిన రామకృష్ణ ఎవరితో సరిగా మాట్లాడకుండా, అడిగినా ఏమీ చెప్పకుండా ఉంటున్నాడు. ఈక్రమంలో ఈనెల 17న రామకృష్ణ గడ్డి నివారణ మందు సేవిస్తూ సెల్ఫీ వీడియో తీసుకొని తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు రామకృష్ణను వారి చెలక వద్ద గుర్తించి వెంటనే మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆపై జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం రామకృష్ణ మృతి చెందగా సోమవారం తండ్రి యాకన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. యాకన్నకు ముగ్గురు కుమారులు కాగా, అవివాహితుడైన రామకృష్ణ రెండో సంతానం. కాగా, యువకుడు గడ్డి నివారణ మందు తాగే వీడియో స్థానిక సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో మాక్ ఎలక్షన్


శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో ఓటుహక్కు వినియోగించుకున్న విద్యార్థులు

మహబూబాబాద్ టౌన్, జూలై 22 : మహబూబాబాద్ జిల్లా కేంద్రం కృష్ణకాలనీలో శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో సోమవారం ఓటుహక్కు విలువను తెలియజేసేందుకు మాక్ ఎన్నికలు నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థి నాయకులను ఎన్నుకునేందుకు బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు జరిపించారు. స్కూల్ పీపుల్ లీడర్, హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్‌ను ఎన్నుకునేందుకు ఆరు నుంచి తొమ్మిదవ తరగతి విద్యార్థినీ విద్యార్థులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ దాసరి మధు మాట్లాడుతూ... ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కు, ఓటుహక్కు ప్రాధాన్యతను తెలియజేసేందుకు మాక్ ఎలక్షన్‌ను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీధర్, శ్రీవిద్య, చేతన్, కృష్ణారావు, డి. నరేష్, లక్ష్మీనారాయణ, యాకన్న, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లాకు దాశరథి పేరు పెట్టాలి

▸▸ జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామరాజు


మహబూబాబాద్‌లో దాశరథి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శంతన్‌రామరాజు, నాయకులు

మహబూబాబాద్‌టౌన్, జూలై 22: మహబూబాబాద్ జిల్లాకు మహాకవి దాశరథి పేరు పెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామరాజు డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణంలో నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం దాశరథి జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా శంతన్ మాట్లాడుతూ.. నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ ఈప్రాంత ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహాకవి దాశరథి అని కొనియాడారు. దాశరథి రచనలు మలిదశ ఉద్యమానికి ఊతమిచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కమ్మగాని కృష్ణమూర్తి, గుంజె హన్మంతు, హరిప్రసాద్, రఘు, వీరన్న, ఉపేందర్, సురేంద్రనాథ్, కపిలయ్య, శ్యామ్, బాలరాజు పాల్గొన్నారు.

- దాశరథి కృష్ణమాచార్యులు తెలంగాణ ఉద్యమానికి దిక్సూచి అని శుభోదయం సాహిత్య, సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలో సంస్థ ఆధ్వర్యంలో దాశరథి జయంతిని నిర్వహించారు. కవులు, రచయితలు ప్రసాద్, సుధీర్, శ్రీధర్, స్వామి, కవిత,మంజుల, దివ్యసాయి, శిరీష, రమ్య పాల్గొన్నారు.
- పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో దాశరథి జయంతిని నిర్వహించారు. క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు హెచ్ఎం ఆర్సుద్ర వెంకటేశ్వర్లు, గిరిజ, వసంత, శ్రీవాణి, సుచిత్ర, సునిత, వీణ, పద్మావతి, సంజీవ, విజయ్‌కుమార్, శ్వేత, రజియా,రంజాన్‌అలీ, విజయలక్ష్మి, మమత, జ్యోత్స్న పాల్గొన్నారు.
- మరిపెడ : దాశరథి కృష్ణామాచార్య పోరాట పటిమ యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని మరిపెడ హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్ఎం బి. రామ్మోహన్ అన్నారు. సోమవారం దాశరథి శత జయంతి ఉత్సవాలను స్థానిక టీచర్లు, విద్యార్థులతో కలిసి స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. దాశరథి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. విద్యార్థులను ఉద్దేశించి రామ్మోహన్ మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనపై దాశరథి కవితా రచనలతో ప్రజాచైతన్యం నింపి పోరాడిన ఘటనలను గుర్తుచేశారు. కార్యక్రమంలో జనార్ధనాచారి, దేవ్లానెహ్రూ, ప్రకాశ్, శౌరి, లెనిన్, ప్రసాదరావు, సారయ్య, జహీదా, సురేశ్, బాబురావు, అనిత, రాజకుమారి, సుధా, మంజుశ్రీ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

దాశరథి ఆశయ సాధనకు కృషి చేయాలి

గూడూరు: దాశరథి కృష్ణమాచార్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని విద్యాశాఖ మండల నోడల్ అధికారి రవికుమార్ అన్నారు. దాశరథి శత జయంతిని పురస్కరించుకుని మండలంలోని అయోధ్యపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరుకు చెందిన దాశరథి కృష్ణమాచార్యులు చేసిన రచనలు సమాజానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షాహిద్‌అలీ, చంద్రమౌళి, లక్షపతి, నవీన్, రమేష్, జగదీశ్వర్, జ్యోతిరాణి, శ్రీనివాస్, చిరంజీవి, రాణి, రమాదేవి, భిక్షపతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

తొర్రూరు రూరల్, జూలై 22 : ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై ఎక్కువగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించడానికి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడుస్తున్నట్లు తొర్రూరు సీఐ సంజీవ్ అన్నారు. సోమవారం తొర్రూరు మండల పరిధిలోని నాంచారిమడూరు నుంచి మాటేడు శివారు వరకు ఉన్న ఎన్‌హెచ్ 563పై గుంతలు పూడ్చించి సీఐ సంజీవ్ మాట్లాడుతూ మండలంలో రహదారిపై జరుగుతున్న ప్రమాదాలను అరికట్టడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జాతీయ రహదారిపై వర్షాలకు గుంతలు ఏర్పడగా, అధికంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాటిని నివారించడానికి గుంతలు పూడుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కూచిపుడి జగదీష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై ఉపేందర్

పెద్దవంగర, జూలై 22 : పెద్దవంగర ఎస్సైగా జి.ఉపేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా పెద్దవంగర ఎస్సైగా పని చేసిన బానోతు మహేష్ వీఆర్ ఖమ్మంకు బదిలీ కాగా, ఆయన స్థానంలో బయ్యారం ఎస్సైగా పనిచేస్తున్న జి. ఉపేందర్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పెద్దవంగర ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ వ్యాపారాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్థానిక పోలీసు సిబ్బంది ఎస్సైకి స్వాగతం పలికారు.

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

పెద్దవంగర, జూలై 22 : కేజీబీవీ పాఠశాలలో ఉంటున్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీసీవో, మండల ప్రత్యేకాధికారి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని చిన్నవంగరలోని కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని, భోజనశాల, వంటశాల, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఆహార పదార్థాల నిల్వలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వంటకు ఉపయోగించే నీరు, తాగునీటిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వైద్యులు క్రమం తప్పకుండా పాఠశాలలను సందర్శించాలని సూచించారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఉపాధ్యాయులను కోరారు.కార్యక్రమంలో తహసీల్దార్ వీరగంటి మహేందర్, ఎంపీడీవో వేణుమాధవ్, ఆర్ఐ లష్కర్, ఎస్‌వో స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

మరిపెడ, జూలై 22: నిబంధనలు విస్మరిస్తూ ఫీజుల పేరుతో దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.వీరబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆ యూనియన్ విద్యార్థి నాయకులతో కలిసి ఆయన మరిపెడ ఎంఈవో పూల్‌చంద్‌కు ప్రైవేట్ పాఠశాలల దోపిడీపై వినతి పత్రం అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. టై, స్కూల్ బెల్ట్, నోట్‌బుక్స్, యూనిఫామ్ పేరుతో విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. కనీస వసతులు లేవన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. అశోక్, కేశవ్, ప్రణయ్, సందీప్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

బురదమయమైన అబ్బాయిపాలెం రోడ్లు

▸▸ మరమ్మతులు చేయాలని సీపీఎం నేతల డిమాండ్

మరిపెడ రూరల్, జూలై 22 : మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అబ్బాయిపాలెంలో ఉన్న రోడ్లు మొత్తం బురదమయ్యాయని, తక్షణమే మరమ్మతులు చేయాలని సీపీఎం మండల నాయకుడు నందిపాటి వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం బృందం అబ్బాయిపాలెం, ఎస్సీ కాలనీలో పలు రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు మట్టి రోడ్లు దెబ్బతినడంతో నడిచే పరిస్థితులు కూడా లేవన్నారు. గత ప్రభుత్వంలో ఎస్సీ కాలనీకి సిమెంట్ రోడ్డు వచ్చినప్పటికీ చివరివరకు పోయలేదన్నారు. అంతేకాక సైడ్ కాల్వలు కూడా నిర్మించలేదన్నారు. వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో వెళ్లాలంటే భయాందోళనలకు గురవుతున్నారన్నారు. ఈ విషయాన్ని గతంలోనే అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యమన్నారు. సీపీఎం సభ్యులు జిన్నా మాధవి, కొండ ఉప్పలయ్య, వెంకన్న, ఎర్ర వెంకన్న, జినుక సైదులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రైలులో నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



కేసముద్రం, జూలై 22 : కేసముద్రం రైల్వేస్టేషన్‌లో వేగంగా వెళుతున్న ఈస్ట్ కోస్ట్ రైలులో నుంచి గుర్తుతెలియని వ్యక్తి పడడంతో తీవ్రంగా గాయాలపాలై మృతి చెందినట్లు వరంగల్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ పి.రాజు తెలిపారు. ఆదివారం సాయంత్రం రైలులో నుంచి పడగా 108లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందినట్లు చెప్పారు. మృతుడికి సుమారు 55ఏళ్లు ఉంటాయని, వైట్, బ్రౌన్ కలర్ గీతల చొక్కా, మల్టీకలర్ చెక్స్ లుంగీ ధరించి ఉన్నాడని అన్నారు. ఛాతిపై పుట్టుమచ్చ, చామనఛాయ రంగు, తెల్లని వెంట్రుకలతో గడ్డం, మీసాలతో ఉన్నాడని, మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎంలో భద్రపర్చినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పంటల నమోదును పూర్తిచేయాలి

▸▸ పట్టా పొందిన రైతులు పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి

▸▸ జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు


మహబూబాబాద్ రైతు వేదికలో సమీక్ష నిర్వహిస్తున్న డీఏవో అభిమన్యుడు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 22 : జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న వివిధ ఆరుతడి పంటల వివరాలు నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి కె.అభిమన్యుడు ఆదేశించారు. మహబూబాబాద్ డివిజన్‌లోని తొమ్మిది మండలాల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తీర్ణాధికారులతో స్థానిక రైతు వేదికలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమన్యుడు మాట్లాడుతూ.. డివిజన్‌లో సాగు చేస్తున్న పత్తి, మొక్కజొన్న, పెసర, కంది ఇతర పంటల సాగు పూర్తయిందని, పంటల నమోదును కచ్చితత్వంతో సేకరించాలని కోరారు. రైతుబంధు, రైతుబీమా, పీఎం కిసాన్ పథకాలు రైతులకు అందే విధంగా చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. కొత్తగా జూన్ 28లోపు పట్టా పొందిన రైతులు రైతుబీమా, రైతుభరోసా కోసం తమ క్లస్టర్ల పరిధిలో వ్యవసాయ విస్తీర్ణాధికారులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతుబీమా కోసం దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం, రైతు ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు సమర్పించాలని కోరారు. సమావేశంలో మహబూబాబాద్ ఏడీఏ లక్ష్మీనారాయణ, వివిధ మండలాల వ్యవసాయాధికారులు ఎస్.తిరుపతిరెడ్డి, బి.వెంకన్న, ఎస్.రవీందర్‌రెడ్డి, రాంజీనాయక్, కె.రామారావు, రాకేష్, ఉదయ్‌తో పాటు ఏఈవోలు పాల్గొన్నారు.

రైతుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

రూ.లక్ష లోపు రుణమాఫీ జరగని రైతుల నుంచి ఫిర్యాదులను జిల్లా వ్యవసాయాధికారులు స్వీకరణకు నడుం బిగించారు. ఈ నేపథ్యంలో సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయాధికారి ఎన్. తిరుపతిరెడ్డి ఏఈవోలతో కలిసి రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. సాయంత్రం వరకు మండలంలోని 20 మంది రైతులు తమకు రూ.లక్ష లోపు ఉన్నప్పటికి మాఫీ కాలేదని ఫిర్యాదు చేశారు. అలాగే జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో 100 మంది రైతుల వరకు లిఖితపూర్వకంగా, ఫోన్ ద్వారా మరో 70మంది వరకు ఫిర్యాదు చేశారు. జిల్లాలోని వివిధ మండలాల్లోని రైతులు ఆయా వ్యవసాయాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

▸▸ ఎమ్మెల్యే మురళీనాయక్


కేసముద్రం సొసైటీలో పంటరుణాల చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కేసముద్రం, జూలై 22: రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. కేసముద్రం సొసైటీ ఆధ్వర్యంలో పంట రుణమాఫీ అమలైన 177 మంది రైతులకు రూ.84.40లక్షల నూతన రుణాల చెక్కులను సోమవారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో 32 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. రైతు వేదిక భవనంలో మహిళా సాధికారిత సమాఖ్య వార్షిక సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట రుణాలు మాఫీ అయిన రైతులకు కొత్త రుణాలు ఇస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలేవీ ఇవ్వనంత ప్రాధాన్యతను మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్రం అంతటా ఉచిత బస్సు, రూ.500లకే గ్యాస్ సిలెండర్, డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించిందని తెలిపారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ దామోదర్, సొసైటీ ఛైర్మన్ ధీకొండ వెంకన్న, వైస్ ఛైర్మన్లు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, పీసీసీ సభ్యుడు దస్రూనాయక్, మాజీ సర్పంచ్‌లు భట్టు శ్రీను, ముదిగిరి సాంబయ్య, భూక్య శ్రీనివాస్, డీఆర్‌డీఏ ఏపీడీ జయశ్రీ, డీపీఎం శ్రీనివాస్, డీసీసీబీ బీఎం సింధు, సొసైటీ సీఈవో వెంకటాచలం, ఏపీఎం రాజీర్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ అధికారిక కార్యక్రమంలో ప్రొటోకాల్ లేని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా పిలవకుండానే వేదికపైకి రావడం చర్చనీయాంశంగా మారింది.

కల్వల హైస్కూల్‌లో 'పై' డే

కేసముద్రం, జూలై 22 : మండలంలోని కల్వల జడ్పీ హైస్కూల్‌లో సోమవారం 'పై' డేను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం బండారు నరేందర్ మాట్లాడుతూ గణిత శాస్త్రంలో 'పై' ఎంతో ప్రాముఖ్యత కలిగిందని, ఇందుకోసం ఒక డే ఉందని తెలిపారు. పాఠశాలలో ఏడు రోజుల పాటు నిర్వహించే శిక్ష సప్తాహ కార్యక్రమంలో విద్యార్థులు తయారు చేసిన మెటీరియల్‌ను జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఆజాద్ చంద్రశేఖర్ పరిశీలించారు. ఉపాధ్యాయులు ఆర్. యాకాంబ్రం, టి.సదానందం,ఎం.యాకాంబ్రం, సత్యనారాయణ, నాగేందర్, బాలశౌరెడ్డి, రాజేంద్రచారి, ఆర్.భిక్షపతి, పీడీ శంకర్ పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

మహబూబాబాద్ రూరల్, జూలై 22 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా బీసీ డిక్లరేషన్‌ను కాలయాపన చేయకుండా తక్షణమే అమలు చేయాలని బీజేపీ అనుబంధ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫైండ్ల శ్రీనివాస్ అన్నారు. మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో మారగాని రాజుగౌడ్, చుక్కల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. మహబూబాబాద్ నుంచి సోమవారం సాయంత్రం టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సీజనల్ వ్యాధుల నివారణ యాక్షన్ ప్లాన్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మండల ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన మండలాల్లో సంబంధిత అధికారులతో కలిసి యాక్షన్ ప్లాన్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. తద్వారా గ్రామ స్థాయిలో ప్రజలకు వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం.. యాక్షన్ ప్లాన్ ద్వారా ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా పరిశుభ్రత, పారిశుద్ధ్యం, బ్లీచింగ్ పౌడర్, మురికినీటిల్లో ఆయిల్ బాల్స్ వేయుట, తడిపొడి చెత్త సేకరణ, పిచ్చిమొక్కల తొలగింపుపై దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా ప్రబలకుండా క్షేత్రస్థాయిలో ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడంకోసం ఇంటింటా ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మహబూబాబాద్ రూరల్, జూలై 22 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన ప్రకారం... కేసముద్రం మండలం పెనుగొండ గ్రామ శివారు చెరువుకొమ్ముతండాకు చెందిన వాంకుడోతు శంకర్(28) ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై గాయత్రిగుట్ట సమీపం నుంచి మహబూబాబాద్‌కు వస్తున్నాడు. ఈక్రమంలో ఆర్టీసీ కాలనీ వద్ద హౌసింగ్‌బోర్డ్ కాలనీకి చెందిన చింతల లక్ష్మణ్ ఆటో ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని స్థానికులు 108 ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య కోసం కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. తండ్రి భీక్షం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


లక్ష్మి (ఫైల్)

కురవి, జూలై 22: కురవి మండలం నేరడ గ్రామానికి చెందిన చెల్లగొల్ల లక్ష్మి(48) విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందింది. కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం... తమ వ్యవసాయ క్షేత్రంలో మధ్యాహ్నం సమయంలో వరి మడులకు నీరు పెట్టేందుకు లక్ష్మి విద్యుత్‌మోటార్ వద్దకు వెళ్లింది. ఈక్రమంలో తెగివున్న సర్వీస్ వైరును గమనించని లక్ష్మి ప్రమాదవశాత్తు వైరును తాకగా, విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. కొద్దిసేపటి తర్వాత అటుగా వచ్చిన పశువుల కాపరులు లక్ష్మిని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకుని లక్ష్మిని మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఆమెకు భర్త మల్లయ్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కాగా, లక్ష్మి సీపీఎం మండల కమిటీ సభ్యురాలిగా పనిచేస్తున్నారు. జిల్లా ఆస్పత్రిలో లక్ష్మి మృతదేహాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, నాయకులు ఆకుల రాజు, గునిగంటి రాజన్న, సూర్నపు సోమయ్య, మలేడి కోటయ్య సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

మహిళను వేధించిన వ్యక్తికి జైలుశిక్ష

తొర్రూరు, జూలై 22: ఓ మహిళను లైంగికంగా వేధించిన వ్యక్తికి ఏడాది జైలుశిక్షతో పాటు రూ.2వేలు జరిమానా విధించినట్లు ఎస్సై జగదీష్ సోమవారం తెలిపారు. తొర్రూరుకు చెందిన కొండపల్లి వెంకన్న 2018లో పట్టణానికి చెందిన ఒక మహిళను లైంగికంగా వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్సై నగేష్ కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. కోర్టులో సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టి పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేవతిదేవి కేసును వాదించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత అతనికి ఏడాది జైలుశిక్షతోపాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరిచిన కోర్టు కానిస్టేబుల్ సతీష్‌ను డీఎస్పీ సురేష్, సీఐ సంజీవ, ఎస్సై జగదీష్ అభినందించారు.

ఒకరిపై కేసు నమోదు

తొర్రూరు కోర్టు ఆవరణలో నిబంధనలను ఉల్లఘించి సిబ్బందిని దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. మరిపెడ మండల కేంద్రానికి చెందిన ఇ.కృష్ణమూర్తి అనే వ్యక్తి కోర్టు సిబ్బందిపై కోర్టు ఆవరణలో దూషించడంతో పాటు విధులకు ఆటంకపర్చాడు. కోర్టు సూపరింటెండెంట్ నరసింహమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కృష్ణమూర్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

▸▸ ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య


మండలంలోని పోచారం పెద్ద చెరువు పంట కాల్వల పూడికతీత పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

గార్ల, జూలై 22 : ఏజెన్సీ ప్రాంతమైన ఇల్లెందు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం మండలంలోని పోచారం, పుల్లూరు, ముల్కనూరు, పలు గ్రామాల్లో చెరువుల పంట కాల్వల మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రుల సహకారంతో నియోజకవర్గానికి అధిక నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. గత పాలకులు పదేళ్లు పాలించినా నియోజక వర్గానికి ఏఒక్క అభివృద్ధి పని పూర్తి చేయలేదన్నారు. ప్రజలు నాకిచ్చిన తోడ్పాటుకు నేను మీ సేవకే ఉపయోగపడుతానన్నారు. దేశ చరిత్రలో ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ హామీని అమలు చేసిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికే దక్కిందన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బట్టు నాగరాజు, జడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, పీఏసీఎస్ ఛైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్ నాయక్, ఎంపీటీసీలు మన్నేపల్లి సుగుణాదేవి, భూక్యా మంజుల, కాంగ్రెస్ నాయకులు కట్టా శ్రీనివాస్‌రావు, మన్నేపల్లి సైదయ్య, మన్నేపల్లి వెంకయ్య, రామారావు, యాకుబ్ పాషా, చాంద్ మాల్, మాన్‌సింగ్, ఇందుర్తి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- బయ్యారం : బయ్యారంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బాధిత కుటుంబాలకు అందజేశారు. స్థానిక పీఏసీఎస్ సొసైటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రూ.1.98లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ మధుకర్‌రెడ్డి, నాయకులు ముసలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వరరావు, రమణమ్మ, రవి నాయక్, రాంమూర్తి, సురేష్, సతీష్, సాయి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వార్డు ఆఫీసర్ మృతి


యాకయ్య (ఫైల్)

దంతాలపల్లి/మరిపెడ, జూలై 22: ఖమ్మంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మరిపెడ మునిసిపల్ వార్డు ఆఫీసర్ జటంగి యాకయ్య(37) అక్కడికక్కడే మృతి చెందారు. బంధువుల కథనం ప్రకారం.. దాట్ల గ్రామానికి చెందిన జటంగి యాకయ్య 2012లో వీఆర్ఏగా ఎంపికై ఉమ్మడి నర్సింహులపేటలో 2016 వరకు పనిచేసి నూతనంగా ఏర్పడ్డ దంతాలపల్లి మండలం దాట్ల గ్రామ వీఆర్ఏగా 2016 నుంచి 2023 ఆగస్టు 9 వరకు విధులు నిర్వర్తించారు. కేసీఆర్ ప్రభుత్వం వీఆర్ఏలను వివిధ శాఖల కేటాయింపులో భాగంగా మరిపెడ మునిసిపాలిటీలో వార్డు ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు.యాకయ్య ఉన్నత చదువులు చదివి ఉద్యోగ అన్వేషణలో ఉండగా, సతీమణి జటంగి గౌతమి డిగ్రీ పూర్తిచేసి ఉపాధ్యాయ శిక్షణ పూర్తిచేశారు. డీఎస్సీ పరీక్ష రాసేందుకు ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు బైక్‌పై వెళ్తుండగా ఖమ్మం రైల్వేస్టేషన్ శివారులో కారు అతివేగంగా వచ్చి ఢీకొనడంతో యాకయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య గౌతమి తీవ్ర గాయాలపాలై ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందింది. మెరుగైన వైద్య చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మృతుడికి తల్లిదండ్రులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్, మరిపెడ మునిసిపల్ కమిషనర్ వెంకటస్వామి, తహసీల్దార్ సైదులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఖమ్మం వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.